క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పద్మావతి



రాజుపాలెం: ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పల్నాడు జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజ నాయక్‌తో మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, ఎన్‌సీడీ సర్వే, ఆయుస్మాన్ భారత్ హెల్త్ కార్డులు, ఈ కేవైసీ సర్వే వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు తదితరులు ఉన్నారు.

రేషన్ షాపుకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి

పెదకూరపాడు: రేషన్ కార్డుదారులు జూన్ 1 నుంచి మీ పరిధిలో ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని తహసీల్దార్ ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఇకపై ఇళ్ల వద్దకు వచ్చి రేషన్ ఇవ్వరని, లబ్ధిదారులే రేషన్ దుకాణాల వద్దకు వెళ్లాలని సూచించారు. దివ్యాంగులు, 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు రేషన్ డీలర్లు ప్రతి నెల 1 నుంచి 5వ తేదీ లోపు స్వయంగా ఇంటికి వెళ్లి రేషన్ అందించాలన్నారు.

జూన్ 1 నుంచి రేషన్ సరుకులు డీలర్ల వద్ద తీసుకోవాలి

తహసీల్దార్ వి.వి.నాగరాజు



క్రోసూరు: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ సరుకులు ప్రజా పంపిణీ డీలర్ల వద్ద తీసుకోవాలని తహసీల్దార్ వీవీ నాగరాజు మంగళవారం తెలిపారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసినందున ఇక నుంచి కార్డుదారులు డీలర్ల వద్ద రేషన్ తీసుకోవాలన్నారు. వికలాంగులు, 65 సంవత్సరాలు పై బడిన వారికి ప్రతి నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు డీలర్లు మొదటి ప్రాధాన్యత కింద లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు తీసుకోవాలని తహసీల్దార్ కోరారు.

పిల్లలు మంచి మార్గంలో నడవాలి

రెవరెండ్ ఆలూరి నానిబాబు



అమరావతి: స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో రెండు రోజుల పాటు తెలుగు బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో వేసవి సెలవులను పుస్కరించుకుని పిల్లలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఆలూరి నానిబాబు మాట్లాడుతూ పిల్లలు చిన్న వయసులో మంచి మార్గంలో నడవాలని, మంచి ప్రవర్తన కలిగి ఉండాలని బోధించారు. చిన్న వయసు నుంచి ఎదుటివారి యెడల కరుణ, దయ, జాలి కలిగి తోటి వారిని ప్రేమించగలిగే గుణం అలవర్చుకోవాలన్నారు. సోమవారం ప్రారంభమైన శిక్షణ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తెలుగు బాప్టిస్ట్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అనారోగ్యం తాళలేక వ్యక్తి ఆత్మహత్య


నకరికల్లు: అనారోగ్యం తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దేచవరం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేచవరం గ్రామానికి చెందిన వల్లెపు సుబ్బారావు (68) గత ఆరునెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో అనారోగ్య సమస్య తాళలేక సోమవారం ఇంటి వద్దనే పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ మంగళవారం తెలిపారు.

అందని బిల్లులు.. ఆందోళనలో పాడి రైతులు

- ఆరు నెలలుగా ఎదురుచూస్తున్న వైనం
- ఆర్భాటంగా పశువుల షెడ్ల నిర్మాణం
- పండగలా ప్రారంభోత్సవాలు



పల్లె పండుగ పేరుతో చాగంటివారిపాలెంలో గోకులం షెడ్‌ను ప్రారంభించిన దృశ్యం (ఫైల్)



చాగంటివారిపాలెంలో నిర్మించిన గోకులం షెడ్డు

ముప్పాళ్ళ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గోకులం షెడ్డు నిర్మాణం మంజూరు చేయించుకున్నాడు. వెంటనే పనులు చేపట్టి సొంత డబ్బులతో నిర్మాణం ప్రారంభించాడు. ఎమ్ఎస్ఆర్ఈజీఎస్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు నిర్మాణంలో వాడే మెటీరియల్‌పై పెట్టిన కొర్రీలతో విసిగి వేశారి ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేశాడు. ప్రభుత్వం మంజూరు చేసిన దాని కంటే అదనంగా మరో రూ.60 వేల వరకు ఖర్చు చేశాడు. నిర్మాణం పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క రూపాయి జమ కాలేదు. నిర్మాణానికి తెచ్చిన డబ్బులకు వడ్డీ పెరుగుతుందే తప్ప నిధుల మంజూరుపై అధికారుల నుంచి నేటికీ సరైన సమాధానం అందక ఆందోళన చెందుతున్నాడు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోకులం షెడ్ల నిర్మాణాల మాదిరిగానే నిధులు నిలిచిపోతాయేమోనని లోలోన మదన పడుతున్నాడు. ఇది ఈ ఒక్క రైతు పరిస్థితి కాదు మండలంలో గోకులం షెడ్లు నిర్మించుకున్న పలువురు పాడి రైతులకు బిల్లులు రాక ఆందోళన చెందుతున్నారు.

ఆరు నెలలుగా ఎదురుచూపులు

అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం గోకులం షెడ్ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. చెప్పిందే తడవుగా గ్రామాల్లో రైతులు షెడ్లు నిర్మించుకున్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2 లక్షల 25 వేలు కేటాయించింది. సబ్సిడీ రూ.25 వేలు పోను రూ.2 లక్షలు లబ్ధిదారునికి అందాల్సి ఉంది. అందుకు రావాల్సిన బిల్లులు కోసం ఆరు నెలల నుంచి ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ముందుకొచ్చి అప్పు చేసి మరీ షెడ్లను నిర్మించుకున్న వారి ఆశలు అడియాశలవుతున్నాయి. షెడ్లు నిర్మాణానికి రూ.లక్షలు ఖర్చు చేసినా నేటికీ బిల్లులు అందలేదు. ఎప్పుడొస్తాయో కూడా తెలియని పరిస్థితి. అప్పులు చేసి నిర్మించుకున్నామని ఇంత వరకు బిల్లులు రాకపోవడంతో ఏమి చెయ్యాలో దిక్కుతోచడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలోని 9 మండలాల పరిధిలో 236 షెడ్లు మంజూరు కాగా వాటిల్లో 220 షెడ్ల నిర్మాణాలు ప్రారంభించారు. అందులో 180 షెడ్లు నిర్మాణాలు పూర్తి కాగా, మరో 23 షెడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన షెడ్లకు పండగలా ప్రారంభోత్సవాలు చేశారు.

సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలో షెడ్లు ఇలా...

మండలం	మంజూరు	పూర్తయినవి
సత్తెనపల్లి	27	24
ముప్పాళ్ళ	25	17
నకరికల్లు	32	11
రాజుపాలెం	25	23
అచ్చంపేట	25	23
క్రోసూరు	24	20
పెదకూరపాడు	26	23
బెల్లంకొండ	26	19
అమరావతి	26	20

త్వరలో వచ్చే అవకాశం ఉంది

రైతులు సబ్సిడీపై మంజూరైన గోకులం షెడ్లు నిర్మాణాలు చాలా వరకు పూర్తి చేశాం. నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పెండింగ్ ఉంది. నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారుల వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలకే నిధులు కేటాయిస్తుంది. గోకులం షెడ్ల నిర్మాణాలకు సంబంధించి త్వరలో బిల్లులు వచ్చే అవకాశం ఉంది. పాడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– పి.వెంకటనారాయణ, ఎమ్ఎస్ఆర్ఈజీఎస్ ఏపీడీ, సత్తెనపల్లి క్లస్టర్

నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ పూర్తి చేయాలి

గుంటూరు డివిజన్ డీఆర్‌యూసీసీ మెంబర్ చల్లంచర్ల సాంబశివరావు



సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్‌కు వినతి పత్రం అందిస్తున్న చల్లంచర్ల

సత్తెనపల్లి: నడికుడి– శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ డీఆర్‌యూసీసీ మెంబర్ చల్లంచర్ల సాంబశివరావు కోరారు. సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) సుధేష్ణ సేన్‌కు మంగళవారం ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల కల అయిన నడికుడి – శ్రీకాళహస్తి నూతన రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, అయితే నడికుడి నుంచి పల్నాడు జిల్లాలోని శావల్యాపురం వరకు మాత్రమే పనులు జరిగాయన్నారు. మిగిలిన నిర్మాణ పనుల్లో చాలా కాలంగా ప్రగతి లేదని, ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పాత ఉమ్మడి జిల్లాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ రైల్వే లైన్ పూర్తి అవ్వడం వల్ల తిరుపతి, చెన్నై ప్రయాణం పల్నాడు నుంచి సులభతరంగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా తిరుపతి, చెన్నై వెళ్లేందుకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో కూడా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ స్టాప్ ఇచ్చిన ఎడల పట్టణ ప్రజలకు చాలా మేలు జరుగుతుందని, ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉందన్నారు. సికింద్రాబాద్–హౌరా(12704), హౌరా– సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో స్టాప్ ఇవ్వాల్సిందిగా కోరారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలి

జిల్లా వైద్యాధికారి రవి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

నాదెండ్ల: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసూతి కాన్పుల సంఖ్య గణనీయంగా పెంచి గర్భిణులు, బాలింతలకు ఉత్తమ సేవలందించాలని జిల్లా వైద్యాధికారి రవి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ప్రతిరోజూ వైద్యశాలకు ఎంతమంది రోగులు వస్తున్నారు, నెలకు ఎన్ని కాన్పులు జరుగుతున్నాయి, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డులు, రక్త పరీక్షల కేంద్రం, శస్త్రచికిత్సల గది, మందుల గదిని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా సేవలందించాలన్నారు. రోజురోజుకు ఓపీ పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాయిశ్వేత, జ్ఞానేశ్వరి, సీహెచ్‌వో కమలకుమారి, డీపీవో ఉన్నూర్ బాషా, ఎంపీహెచ్ఎస్ కట్టా దిలీప్‌కుమార్, సీసీ హర్షవర్ధన్, హనుమానాయక్ పాల్గొన్నారు.

దళిత యువకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐలను సస్పెండ్ చెయ్యాలి

గార్లపాటి దాసు

క్రోసూరు: దళిత యువకులపై బహిరంగంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించటాన్ని వ్యతిరేకిస్తూ తెనాలి టూ టౌన్, త్రీ టౌన్ సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో ముగ్గురు దళిత యువకులపై పట్టపగలు టూ టౌన్ సీఐ రాములు నాయక్, త్రీ టౌన్ సీఐ రమేష్ బాబు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాసి దారుణంగా, బహిరంగంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించటం చట్ట విరుద్ధమని అన్నారు. నేరం చేస్తే న్యాయస్థానాలకు అప్పజెప్పాలి గానీ ఇంత క్రూరంగా కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. దళిత యువకులపై అక్రమ కేసు పెట్టిన కానిస్టేబుల్ కన్నా చిరంజీవి (పీసీనంబర్ 6068)ను కూడా సస్పెండ్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని లేకుంటే జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని గార్లపాటి దాసు హెచ్చరించారు.

సైబర్ మోసాలపై కిశోరి వికాసం చైతన్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న శాంతకుమారి

యడ్లపాడు: మండలంలోని కొత్తపాలెం, కొండవీడు గ్రామాల్లో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో జి.శాంతకుమారి, డీసీపీయూ ఐపీవో ప్రశాంతి పాల్గొని ప్రసంగించారు. పెరుగుతున్న సైబర్ ఆర్థిక నేరాలు, వాటి మోసపూరిత ధోరణులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలపై చర్చించారు.
సాంకేతిక పరిజ్ఞాన వృద్ధితో పాటుగా నేరాలు కూడా మారుతున్న తరుణంలో, యువతను, మహిళలను డిజిటల్ భద్రతపై చైతన్యవంతులుగా చేయడం ముఖ్యమని వారు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం జోజమ్మ, కొత్తపాలెం అంగన్‌వాడీ కార్యకర్త యశోదా దేవి, కొండవీడు అంగన్‌వాడీ కార్యకర్తలు నళిని, కరిమున్ పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్

రెంటచింతల: ప్రధానమంత్రిగా అనేక సంస్కరణలు చేపట్టి దేశాభివృద్ధిలో చాచా నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ అన్నారు. మంగళవారం పాఠశాలలో దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని మేధావులు, యువతను చాచా నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలోకి ఆకర్షించారని గుర్తు చేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అయిన నెహ్రూ త్యాగాన్ని భారతజాతి ఎప్పటికీ మరువదన్నారు. దేశానికి 16 సంవత్సరాలు ప్రధానమంత్రిగా ఉన్న నెహ్రూ వ్యవసాయం, పరిశ్రలు రెండు దేశాభివృద్ధికి దోహదపడతాయని గ్రహించి అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మేధావిగా పేరు పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు సూరపురెడ్డి పుల్లారెడ్డి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కాకుమాను సురేష్, శ్రీను నాయక్, ఖాసిం, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

టీసీఎస్‌లో ఐటీ ఉద్యోగాలకు కృష్ణవేణి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు టీసీఎస్ (ఐటీ) కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. టీసీఎస్ కంపెనీ దశల వారీగా నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో తమ కళాశాల 2024–25 విద్యా సంవత్సరం ఫైనలియర్ బీఎస్సీ విద్యార్థులు 15 మంది ఉద్యోగాలు సాధించారని వివరించారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు గత ఫిబ్రవరి 14వ తేదీన క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా ఆన్‌లైన్ పరీక్ష, ఏప్రిల్ 14, 15 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. ఆయా ఇంటర్వ్యూల ఫలితాలను ఈ నెల 26వ తేదీన ప్రకటించగా, తమ విద్యార్థులు 15 మంది ఎంపికయ్యారని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తమ విద్యార్థులు టీసీఎస్ (ఐటీ)లో 15, టీసీఎస్ (బీపీఎస్) 15, ఇన్ఫోసిస్ (ఐటీ) 8, విప్రో (ఐటీ) 10 మంది ఎంపికయ్యారని వివరించారు. ఎంపికై న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నాతాని, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ ఎం.బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

వీధి నాటకాలతో హెచ్ఐవీపై అవగాహన

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్థూపం సెంటర్‌లో కళాజాత బృందాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. వీధి నాటకాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవీ వస్తే తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఏఆర్టీ కేంద్రం ద్వారా ఇచ్చే మందులు వాడినట్లయితే జీవితకాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. సీడీ 4, వైరల్‌లోడ్ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ సురేష్, ఓఆర్‌డబ్ల్యూ ఎస్‌కే ఆశ, డి.జయకుమారి, విజయ, రమేష్, జకరయ్య, బి.రిబ్కా, రహంతున్నీసా, టార్గెట్ ఇంటర్వెన్షన్ ఎన్జీవో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సిబ్బంది, వైద్యసిబ్బంది, కళాజాత బృందం పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్తు మెరుగుకే కిశోరి వికాసం



అచ్చంపేటలో మాట్లాడుతున్న సీడీపీవో సరళ

అచ్చంపేట: బాలికలు వారి భవిష్యత్తును మెరుగుపరచుకోవడానికి, సమాజంలో ఒక మంచి భాగస్వామ్యం కలిగి ఉండేందుకు రూపొందించిందే కిశోరి వికాసం అని క్రోసూరు సెక్టార్ సీడీపీవో సరళ అన్నారు. కిశోరి వికాశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరు, అచ్చంపేటలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల అభివృద్ధి, సాధికారత కోసం, కౌమార బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఆత్మరక్షణ, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించడమే కిశోరి వికాశం ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థల్లో కిశోరి వికాసం బృందాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. బాలికలు వారికి ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలియజేయడం జరుగుతుందని సీడీపీవో సరళ అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలత్రిపురసుందరి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, కోటమ్మ, జ్యోతి, హరీష, లక్ష్మి, దయామతి, మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు విక్టోరియా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అందరూ చదువుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీవో ప్రశాంత్


సత్తెనపల్లి: బాలికలందరూ చదువుకోవాలని డీసీపీవో ప్రశాంత్ అన్నారు. పట్టణంలోని 15, 16 వార్డులకు సంబంధించి 16వ వార్డులో మంగళవారం సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి బాలిక చిన్నప్పటి నుంచి చదువుకోవాలన్నారు. చదువుకుంటే అన్ని రంగాల్లో ముందంజలో ఉండవచ్చునన్నారు. చదువుకోవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. బాల్య వివాహాలు, చట్టాలు, సమాజంలో బాలికలు ఎలా ఉండాలి? చదువుకుంటే కలిగే ప్రయోజనాలు, తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో ఓఆర్‌సీఓ నానమ్మ, ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ పి.ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, రాణి, కిశోర బాలికలు తదితరులు ఉన్నారు.

ముప్పాళ్ళలో...



కిశోరి వికాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనంతలక్ష్మి

ముప్పాళ్ళ: కిశోర బాలికలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.అనంతలక్ష్మి, జి.జయలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ, మాదల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కలిగించారు. కిశోర బాలికల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో డీసీపీవో యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంత్, అవుట్ రిసోర్స్ పర్సన్ నానమ్మ, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉయ్యందనలో కిశోర బాలికలతో సూపర్‌వైజర్ మైమున్నీసా

బాల్య వివాహాలు ప్రమాదకరం



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమీజున్

నకరికల్లు: బాల్య వివాహాలు పుట్టబోయే బిడ్డకు, తల్లికి ప్రమాదకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రమీజున్ తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని బాల్య వివాహాలు విడనాడాలన్నారు. బాలికల్లో అక్షరాస్యతను పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. లింగ వివక్ష అభివృద్ధికి ఆటంకమన్నారు. 11 నుంచి 18 ఏళ్ల వయస్సులోపు కిశోర బాలికలకు శారీరక వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, ప్రసన్న, కెజియా, కిశోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...



పెదకూరపాడులో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

పెదకూరపాడు : కిశోరి వికాసంలో భాగంగా పెదకూరపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ షేక్ ముని, సాయి శ్రీలక్ష్మి, స్రవంతులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. చిన్న వయస్సులో వివాహాలు చేసుకోవడం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై కిశోర బాలికలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: మండలంలోని ఉయ్యందన గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో సెక్టార్ సూపర్‌వైజర్ సయ్యద్ మైమున్నీసా ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు సైబర్ నేరాలు, ఆర్థిక భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, ఎంఎస్‌కే, ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.
క్రోసూరులో జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి పాల్గొని సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సెల్‌ఫోన్‌లలో చాటింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చిరునామా, ఫోననెంబర్లు, కాలేజీ, పాఠశాలల వివరాలు ఎవరికైనా ఇచ్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిచితులతో ఎటువంటి సమాచారాలు షేర్ చేసుకోవటం చేయకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఎంపీడీవో జీవీ సత్యనారాయణ



రాజుపాలెం: ప్రతి ఒక్కరు ప్రతి రోజు యోగాను అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి అధికారులు, సిబ్బందితో మంగళవారం యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత ఉండునని, ఆరోగ్యం పరిపూర్ణంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేష్‌రావు, ఎంఈవో మల్లికార్జున శర్మ, ఏపీఎం శివకుమార్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.